# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 20-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 22న సౌదీ అరేబియాలోని జెడ్డాకు వెళ్లనున్నారు.

- ఈస్టర్ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

- అమెరికా ఉపాధ్యక్షులు జేడి వాన్స్ నాలుగు రోజులు భారత పర్యటనలో భాగంగా రేపు భారత్ కు రానున్నారు.

- యువ ఐఏఎస్ లు తమ సేవలతో అత్యున్నత ప్రమాణాలను నిలపాలని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సూచించారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27న ప్రసారమవుతుంది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఈ నెల 22న సౌదీ అరేబియాలోని జడ్డాకు వెళ్లనున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను సౌదీ అరేబియాలోని భారత రాయబారి సుహేల్ అజాజ్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి తొలిసారిగా జడ్డాకు వస్తున్నారని, అయితే గతంలో రెండు సార్లు సౌదీ అరేబియ సందర్శించారని తెలిపారు. భారత్, సౌదీ అరేబియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఈ పర్యటన ముఖ్యమైనదని అన్నారు. రక్షణ భాగస్వామ్యం, ఇంధన సహకారంతో పాటు విభిన్న రంగాలపై చర్చలు జరగనున్నాయని వెల్లడించారు.

========================

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ ప్రజలలో కొత్త ఆశలను, స్ఫూర్తిని, ప్రేమని ప్రేరేపిస్తుందని రాష్ట్రపతి అన్నారు. ఏసు క్రీస్తు భోధనలు మానవులని ప్రేమ, త్యాగం మార్గాలను అనుసరించే దిశగా ప్రేరేపిస్తాయని ద్రౌపది ముర్ము అన్నారు.

యేసు క్రీస్తు మానవాళికి చూపిన కరుణ, క్షమ, సేవ వంటి బోధనలు సామరస్య పూర్వకమైన సమాజాన్ని నిర్మించడానికి మార్గ నిర్దేశం చేస్తాయని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ పేర్కొన్నారు.

ఈస్టర్ పండగ ప్రత్యేకమైనదని, ఇటువంటి పవిత్ర సందర్భంలో ప్రతి వ్యక్తిలో నూతన ఆశ, పునరుద్ధరణ, కరుణను ప్రేరేపించాలని ప్రార్థించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమంలో తెలిపారు.

========================

అమెరికా ఉపాధ్యక్షులు జేడి వాన్స్ నాలుగు రోజులు భారత పర్యటనలో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి రేపు ఉదయం న్యూఢిల్లీకి రానున్నారు. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సారిగా వాన్స్ భారత్ వస్తున్నారు. రేపు సాయంత్రం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ కానున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీతో పాటు మరికొన్ని ప్రాంతాలను సందర్శిస్తారు. అమెరికా ఉపాధ్యక్షుడి భారత పర్యటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో పురోగతికి దోహదపడడంతో పాటు పరస్పరం ఆసక్తి కలిగిన, ప్రాంతీయ, ప్రపంచ పరిణామాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సందర్భంగా విడుదల చేసిన భారత్ అమెరికా ఉమ్మడి ప్రకటన ఫలితాలు, అమలును సైతం సమీక్షిస్తారని ఆకాశవాణి ప్రతినిధి తెలిపారు.

========================

సులభ్ ఉద్యమ స్థాపకుడు దివంగత డాక్టర్ బిందేశ్వర్ పాఠక్ విగ్రహాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఆవిష్కరించారు. లక్నోలోని అలిగంజ్ ప్రాంతంలో ఒక రహదారిని ఆయన పేరును అంకితం చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... సామాజిక జీవితంలో బిందేశ్వర్ పాఠక్ అనుసరించిన సూత్రాలను సమానత్వ మార్గాన్ని స్వీకరించాలని సూచించారు. ఆరోగ్యం, పరిశుభ్రతకు ఎంతో దోహదపడ్డారని, పర్యావరణ హిత టాయిలెట్లను ప్రవేశపెట్టి, భారతదేశ పారిశుధ్య వ్యవస్థను మార్పు చేశారని అన్నారు. ప్రజా ఆరోగ్యానికి మూల స్థంభమైన పారిశుద్య ప్రాముఖ్యతను చాటిన ఆయన వ్యక్తి కాకుండా వ్యవస్థగా నిలుస్తారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

యువ ఐఏఎస్ అధికారులు సమగ్రత, జవాబుదారీతనం, సేవలతో అత్యున్నత ప్రమాణాలను నిలపాలని కేంద్ర సిబ్బంది వ్యహారాలు, పించన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సూచించారు. ఈ రోజు 2023 బ్యాచ్ ట్రైనీ IAS అధికారులతో ఆయన మాట్లాడుతూ... భారతదేశ పరిపాలనా పరివర్తన, వికసిత్ భారత్ 2047 విజన్ తెలియజేశారు. ఈ బ్యాచ్ లో 41 శాతం మహిళల ప్రాతినిధ్యం ఉందని చెప్పారు. 180 మంది అధికారులలో 74 మంది మహిళా అధికారులు ఉండటాన్ని ఆయన ప్రశంసించారు. ఈ ట్రైనీ IAS అధికారులలో అతి పిన్న వయస్కులు, అత్యంత వైవిధ్యత కలిగిన వారు కావడంతో పాటు నూతన భారత ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలుస్తారని జితేంద్ర సింగ్ వ్యాఖ్యానించారు.

విరామం

========================

జమ్మూ, కాశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలోని సెరి బాగ్నా ప్రాంతంలో ఈరోజు భారీ వర్షం కారణంగా ముగ్గురు వ్యక్తులు మరణించారు. మరణించిన వారిలో ఇద్దరు పిల్లలు, ఒక వృద్ధుడు ఉన్నారు. ధరమ్ కుండ్ గ్రామంలో దాదాపు 40 నివాస ఇళ్ళు దెబ్బతినగా, ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రజలను రక్షించినట్లు అధికారులు తెలిపారు. రాంబన్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాలతో సహా రాంబన్ లో నిన్న రాత్రి నుంచి భారీ వడగళ్ళు, కొండచరియలు విరిగిపడటం, బలమైన ఈదురు గాలులు వీచాయి. రాంబన్ ప్రాంతంలోని జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి పొడవునా పలు వాహనాలు ధ్వంసమయ్యాయని రాంబన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కుల్బీర్ సింగ్ ఆకాశవాణి ప్రతినిధికి తెలిపారు. జాతీయ రహదారిపై రెండు వైపులా వాహనాల రాకపోకలు నిలిపివేశారు. శ్రీనగర్-సోనామార్గ్-గుమ్రీ (SSG) రోడ్డు, మొఘల్ రోడ్డు, సింథాన్ టాప్ రోడ్డును మూసివేశారు. రాంబన్ జిల్లా యంత్రాంగం అత్యవసర సహాయం కోసం జిల్లా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. కాగా దీనిపై కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాలు ప్రాణనష్టం, ఆస్తి నష్టంపై విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత ప్రాంతాల్లో పూర్తి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

లడఖ్‌లో నిన్నటి నుండి భారీ హిమపాతం, మంచు తుఫాను కురుస్తోంది. దీనితో లెహ్ హిల్ కౌన్సిల్ (ఎల్‌హెచ్‌సీ) అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఎల్‌హెచ్‌సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ తాషి గ్యాల్సన్ ప్రస్తుత పరిస్థితుల నేపధ్యంలో డిప్యూటీ కమిషనర్, సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌ఎస్‌పి), తహసీల్దార్లతో సహా కీలక అధికారులు  అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించాలని ఆదేశించారు. విపత్తు ప్రతిస్పందన బృందాన్ని కూడా సిద్ధం చేశారు. కొండచరియలు విరిగిపడటం వల్ల  లెహ్-శ్రీనగర్ హైవే, ఇతర ప్రధాన రహదారులు మూసివేశారు. ఈ రోజు లేహ్‌కు వెళ్లే అన్ని విమానాలు రద్దు చేశారు. అలాగే లెహ్‌లో విద్యుత్ లైన్లు దెబ్బతినడంతో 8 గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ప్రస్తుతం సరఫరా పునరుద్ధరించారు. భారీ హిమపాతం, మంచు తుఫాను కారణంగా వ్యవసాయం, ఉద్యానవన రంగాలు, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు రేపటి నుండి మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు.

========================

భారతదేశ ఫారెక్స్ మనీ మార్కెట్లు గడచిన 4 సంవత్సరాలలో రెట్టింపు అయ్యాయిని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ఈరోజు బాలిలో జరిగిన 24వ ఫిక్స్ డ్ ఇన్ కమ్ మనీ మార్కెట్ అండ్ డెరివేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (FIMMDA) వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఆర్థిక మార్కెట్లు, ఆర్థిక వృద్ధికి ఇంధనంగా పని చేసే స్థాయికి అభివృద్ధి చెందాయని చెప్పారు. 2020లో 32 బిలియన్ డాలర్లుగా ఉన్న విదేశీ మరకద్రవ్య మార్కెట్, 2024 నాటికి 60 బిలియన్ డాలర్లకు పెరిగిందని, ఇది దాదాపుగా రెట్టింపు అయిందని తెలిపారు.

========================
========================